క్లుప్తంగా

మెస్ యజమానికి జరిమానా

ఆర్మూర్‌టౌన్: కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఓ మెస్‌ను గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహన్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆహారపదార్థాలు శుభ్రంగా లేకపోవడం, మున్సిపల్ యూజర్ చార్జీలు చెల్లించకపోవడం, ట్రేడ్ లైసెన్సు లేకపోవడంతో మెస్ యజమానికి రూ.1500 జరిమానావిధించారు.

చెక్కుల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని నలుగురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సర్పంచ్ గడ్డం స్వామి పంపిణీ చేశారు. కోఆప్షన్ మెంబర్ అజ్మత్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్‌లో..

రెంజల్(బోధన్): మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. నీలా, తాడ్‌బిలోలి, బాగేపల్లి, బోర్గాం గ్రామాల్లో చెక్కులను అందించారు.

కరాటేలో గోల్డ్ మెడల్స్

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీవిద్యా సాయి హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈనెల 19న జగిత్యాలలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాఠశాలకు చెందిన శ్రీనిక, శ్రీనిజ, శ్రీవర్షిని అనే విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ చాటారు.

సీతారాముల శోభాయాత్ర

వేల్పూర్: పడగల్‌లో శ్రీరామనవమిని పురస్కరించుకొని శోభాయాత్ర గురువారం ప్రారంభించారు. ప్రతి ఏటా ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు సీతారాముల విగ్రహాలతో గ్రామ వీధులలో శోభాయాత్ర నిర్వహిస్తారు. పూజలు చేసి డప్పువాయిద్యాలు, మహిళల మంగళ హారతులతో శోభాయాత్ర చేపట్టారు.

ముందస్తు అరెస్టులు

మోర్తాడ్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై వ్యాఖ్యలు చేసినందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సిట్ విచారణ చేస్తుండటంతో కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ వెళ్లకుండా ఉండటానికి ఏర్గట్లలో గురువారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్‌లను ఏర్గట్లలో అదుపులోకి తీసుకున్నారు.అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

కాంగ్రెస్ నేతలపై నోరు జారితే సహించం

రుద్రూర్: అక్రమాలకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకులు కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే సహించబోమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. రుద్రూర్‌లో ఆయన మాట్లాడారు. బాన్సువాడలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాయకూర్ విండో వైస్ చైర్మెన్ తోట అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ

మాక్లూర్: ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సీసీ రోడ్ల పనులు ఎంత వరకు వచ్చాయనేది ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు.

దాడి అమానుషం

పెర్కిట్(ఆర్మూర్): చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విశాల్ అనే విద్యార్థిపై ఒక వర్గానికి చెందిన 30 మంది దాడి చేయడం అమానుషమని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయి కుమార్ అన్నారు. విద్యార్థిపై దాడిని ఖండిస్తూ గురువారం కళాశాల ఎదుట ఏబీవీపీ నాయకులు నిరసన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

విరాళం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో చేపడుతున్న అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి ఉప్లూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బద్దం చిన్నారెడ్డి రూ.25 వేలు విరాళం అందజేశారు. అదేవిధంగా కమ్మర్‌పల్లికి చెందిన కొమ్ముల బాలకిషన్‌రెడ్డి రూ.50 వేలు విరాళంగా అందజేశారు.

సీసీ రోడ్డు పనుల అడ్డగింత

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. రోడ్ల నిర్మాణానికి వినియోగిస్తున్న ఇసుక నాణ్యతగా లేదని మట్టిలాగా ఉందని పనులను అడ్డుకొని అధికారులకు సమాచారం ఇచ్చారు. పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేల్పూర్‌లో సీసీ పనులు ప్రారంభం

వేల్పూర్: మండల కేంద్రంలో స్థానిక గురడికాపు సంఘం వద్ద సీసీ రోడ్డు పనులను ఎంపీపీ బీమ జమున, మండల బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ప్రారంభించారు. జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు రాములు, ఎంపీటీసీ మొండి మహేశ్, ఉపసర్పంచ్ పిట్లసత్యం పాల్గొన్నారు.

ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్‌లో..

మోర్తాడ్: ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ సభ్యుడు బొల్లి శంకర్ గురువారం ప్రారంభించారు. సర్పంచ్ మోత్కురి మంజుల తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళులు

స్వాతంత్య్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా పలు పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం వారి విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం పోరాడి వారు అమరులయ్యారని, వారు చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి ఉరికంబం ఎక్కి తమ ప్రాణాలను పనంగా పెట్టారని గుర్తు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆర్మూర్‌టౌన్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



వర్ని మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో..



ఒడ్డెట్‌పల్లిలో.. పీవైఎల్ నాయకులు



కమ్మర్‌పల్లిలో.. ప్రజాపంథా నాయకులు

జనవికాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చేయూత

నవీపేట: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని జనవికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి ఆధ్వర్యంలో మండలంలోని 10వ తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. మండల కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించాక పరిసర ప్రాంతంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఈవో గణేష్ రావ్, నవీపేట సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్న, వైస్ చైర్మన్ దొంత ప్రవీణ్, విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు బీడీ దాస్ పాల్గొన్నారు.



పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న పోశెట్టి

కరపత్రాల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్నూర్‌కాపు సంఘంలో ఫంక్షన్‌హాల్‌లో గురువారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించే వీర హనుమాన్ విజయ యాత్ర కరపత్రాలను ఆర్మూర్ నగర సంంచాలక్ పోల్కం నారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న నిర్వహించే వీర హనుమాన్ విజయ యాత్రలో ప్రతీ హిందువు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'విద్యుత్' వాల్ పోస్టర్లు..

ఆర్మూర్‌టౌన్: జిరాయత్‌నగర్‌లో 1104 యూనియన్ కార్యాలయంలో ఆర్మూర్ డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చలో విద్యుత్ సౌధ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ జేఏసీ చైర్మన్ నరేందర్ నాయక్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఏర్పాటు చేసిన చలో విద్యుత్ సౌధ పేరుతో హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు ప్రతి ఒక్క విద్యుత్ ఉద్యోగి హాజరు కావాలని పిలుపు నిచ్చారు.



ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నేతలు

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

రెంజల్(బోధన్): కందకుర్తి, బోర్గాం గ్రామాల్లో గురువారం వీఎస్‌టీ(వజీర్ సుల్తాన్ టుబాకో) కంపెనీ పొగాకు కొనుగోళ్లను ప్రారంభించారు. కందకుర్తిలో స్థానిక సర్పంచ్ ఖలీంబేగ్ బీట్‌ను కంపెనీ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. క్వింటా పొగాకు ధర రూ.10,500గా కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. గత సంవత్సరం క్వింటా ధర రూ.9,600లకు రైతుల నుంచి కొనుగోలు చేశారు. పెరిగిన పెట్టుబడులను దృష్టిలో పెట్టుకుని న్యాయమైన ధర చెల్లించాలని సర్పంచ్‌తో పాటు విండో చైర్మన్ ఇమాంబేగ్, రైతులు ప్రతినిధుల దృష్టికి తీసుకవెళ్లగా వారు సానుకూలంగా స్పందించి ధరను ప్రకటించారు. కందకుర్తి, బోర్గాం గ్రామాలతో పాటు బోధన్ మండలం కొప్పర్గ, కల్దుర్కి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు వివరించారు.



పొగాకు బీట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

ఉత్తమ జాతీయ గ్రామపంచాయతీ హాసాకొత్తూర్

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్ గ్రామపంచాయతీ మండల ఉత్తమ జాతీయ గ్రామపంచాయతీగా ఎంపికైంది. 6 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచడంతో ఉత్తమ జాతీయ గ్రామపంచాయతీగా అవార్డు గెలుచుకొంది. గురువారం ఈమేరకు మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచ్ ఏనుగు పద్మను శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

బాల్కొండ పరిధిలో..

బాల్కొండ: బాల్కొండ మండల పరిధిలోని 10 గ్రామా పంచాయతీలకు వివిధ కేటగిరిల్లో 27 పంచాయతీ అవార్డులు రావడంతో వాటిని గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ లావణ్య అందజేశారు. వైస్ ఎంపీపీ శ్రీకాంత్, జెడ్పీటీసీ దాసరి లావణ్య, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార వినోద్ పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామపంచాయతీలకు సన్మానం

వేల్పూర్: వేల్పూర్ మండల స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన 12 జీపీల కార్యవర్గాన్ని గురువారం మండల రైతు వేదికలో ఎంపీపీ బీమజమున, ఎంపీడీవో కమలాకర్, తహసీల్దార్ రాజేందర్ సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 9 అంశాల అభివృద్ధి కార్యక్రమాలను లెక్కలోకి తీసుకొని గ్రామపంచాయతీల వారీగా గ్రేడు నిర్ణయించారు. వేల్పూర్ జీపీ 7 విభాగాల్లో వంద శాతం పనితీరు కనబరచి మండలస్థాయిలో ఉత్తమ జీపీగా ఎంపికైంది.



హాసాకొత్తూర్ సర్పంచ్ ఏనుగు పద్మను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇరువర్గాలపై కేసు నమోదు

నవీపేట: ఎల్‌కే ఫారమ్‌లో నెలకొన్న ఉగాది ఫ్లెక్సీ వివాదం ఇరువర్గాలపై కేసు నమోదుకు దారి తీసింది. ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ విషయమై గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు రామకృష్ణ, గౌతమ్‌లకు నవీపేట సొసైటీ వైస్ చైర్మన్ దొంత ప్రవీణ్‌లకు మధ్య వివాదం తలెత్తింది. ఈ వివాదంలో తనను కులం పేరుతో దూషించారని ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అధికార వ్యామోహంతో తమపై దౌర్జన్యానికి పాల్పడ్డాడని తండ్రీ కొడుకులు ప్రవీణ్‌పై ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

సమాచారం..

తైబజార్ వేలం పాట వాయిదా..

బాల్కొండ: మండల కేంద్రంలో జీపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించాల్సిన తై బజార్ వేలం వాయిదా పడింది. వేలం పాటకు ఒక్కరే ముందుకు రావడంతో అధికారులు వాయిదా వేశారు. మళ్లీ శనివారం తై బజార్ వేలం నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

28న ఆర్మూర్ తైబజార్ వేలం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని తైబజార్ వేలం పాట ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.5 లక్షలు మున్సిపల్ కమిషనర్ పేరు మీద డీడీ చెల్లించాలన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

బాల్కొండ: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఎంకే గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

మోస్రా మండల సమావేశం

రుద్రూర్: మోస్రా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భారతి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని సభ్యులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

రేపు మాక్ టెస్ట్

బోధన్‌టౌన్(బోధన్): ఎస్సై, కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థులకు పోలీస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 10 గంటలకు మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. బోధన్ పట్టణంతో పాటు ఇతర గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పరీక్ష కేంద్రం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేశారు. స్టడీ మెటీరియల్ కూడా అందించన్నట్లు సీఐ తెలిపారు.

దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు

రుద్రూర్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఈనెల 23 నుంచి 27 వరకు దివ్యాంగుల కోసం ప్రత్యేక బస్సు పాస్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు బోధన్ డిపో మేనేజర్ టీఎన్ స్వామి తెలిపారు. సదరమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో పాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకురావాలన్నారు.

జిల్లా ఉద్యమ దీక్షలకు మద్దతు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రతినిధి ,సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు మద్దతు తెలిపారు. గురువారం ఆయన దీక్షలను ప్రారంభించి మాట్లాడారు.

ఎడపల్లి పీహెచ్‌సీ పరిశీలన

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి పీహెచ్‌సీలో రికార్డులను కేంద్ర ఆరోగ్య శాఖాధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. నివేదికను వారు కేంద్ర ప్రభుత్వ అధ్యయన బృందానికి అందజేస్తారని తెలిపారు. ఒకవేళ అవార్డు దక్కితే రూ.3 లక్షలు ప్రోత్సాహకంగా లభిస్తాయని అన్నారు. దీనితోపాటు పీహెచ్‌సీ స్థాయిని కూడా పెంచే అవకాశాలు ఉన్నాయన్నారు.

'మా డబ్బులు మాకు ఇప్పించండి'

వర్ని: మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఎదుట పీడీ అకౌంట్ బాధితులు గురువారం ఆందోళన నిర్వహించారు. కెనరా బ్యాంకులో సుమారు 40 మంది చిరు వ్యాపారులు రెండు సంవత్సరాలుగా డబ్బులు పొదుపు చేసుకుంటున్నారు. ఈ డబ్బులు ఖాతాదారుల అకౌంట్లో వేయకుండా పీడీ ఏజెంట్, బ్యాంకు మేనేజరు, అసిస్టెంట్ మేనేజర్‌లు సుమారు రూ.40 లక్షల వరకు గల్లంతు చేశారు. ఈ విషయమై బ్యాంకు సిబ్బందిని లోపల పెట్టి బయట నుంచి తాళం వేసి ధర్నా నిర్వహించారు. గల్లంతైన డబ్బులు బాధితులకు అందజేస్తానని హామీ ఇవ్వకపోవడంతో మేనేజర్‌పై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు ఇప్పించకపోతే ప్రతిరోజూ ఆందోళన చేస్తామని భీష్మించుకు కూర్చున్నారు. బాధితుల డబ్బులు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని వర్ని ఎస్సై అనిల్ రెడ్డి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

రుద్రూర్: బాలల పరిరక్షణ బాధ్యత అందరిదని చందూర్ ఎంపీపీ లావణ్యారాంరెడ్డి అన్నారు. చందూర్ మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని, బడిఈడు పిల్లలందరు బడిలో ఉండాలన్నారు. బాల కార్మికులు కన్పిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

బోధన్: ప్రతి మహిళ పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ బోధన్ అర్బన్ సూపర్‌వైజర్ రాధికా రాథోడ్ సూచించారు. గురువారం మున్సిపల్ 26వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషక పక్షోత్సవాలను పురస్కరించుకుని అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..చిరుధాన్యాల్లో పుష్కలంగా పోషకాలుంటాయని పేర్కొన్నారు.



చందూర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

బీఆర్‌ఎస్‌లో చేరిన జెడ్పీ మాజీ చైర్మన్

పెర్కిట్(ఆర్మూర్): జెడ్పీ మాజీ చైర్మన్ గంట సదానందం గురువారం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మహారాష్ట్రలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, నాయకులు పండిత్ పవన్, తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వానిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

పండ్ల వ్యాపారులకు దుకాణాల కేటాయింపు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఫుట్ పాత్‌పై ఏళ్ల తరబడి పండ్ల వ్యాపారం చేస్తున్న వ్యాపారులకు నూతనంగా నిర్మించిన దుకాణాలను గురువారం బల్దియా కార్యాలయంలో కేటాయించారు. దుకాణాల కేటాయింపు కార్యక్రమాన్ని బల్దియా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో రాజేశ్వర్, కమిషనర్ ఖమర్ హైమద్ హాజరయ్యారు. వ్యాపారులకు కేటాయించిన దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ఈ దుకాణాల కేటాయింపు కోసం కౌన్సిలర్‌లు గతంలోనే రెండు సార్లు తీర్మానం చేశారని, ఈ రోజు 19 దుకాణాలను వ్యాపారులకు కేటాయించినట్లు తెలిపారు.



దుకాణాలను కేటాయిస్తున్న కమిషనర్, ఆర్డీవో

బాలకవుల సమ్మేళనం

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్ ఉన్నత పాఠశాలలో శ్రీ శుభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం బాలకవుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 30 మంది విద్యార్థులు తాము రాసిన కవితలను చదివి వినిపించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులకు తెలుగు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మ బహుమతిగా అందించారు. ప్రధానోపాధ్యాయులు రాములు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఉపాధ్యాయులు రవీందర్, నాగప్ప, శంకర్ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించండి

బోధన్: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంమోహన్‌రావు డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25 ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట గొడుగులతో ధర్నా తలపెట్టామని పేర్కొన్నారు.గురువారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ కాలపరిమితి ముగిసినందున వచ్చే జూన్ నెల నుంచి అమలయ్యే విధంగా కొత్త పీఆర్‌సీ కమిటీని నియమించాలని కోరారు.

కరాటే నైపుణ్యంతో ఆత్మరక్షణ



బోధన్‌రూరల్(బోధన్): కరాటే శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాన్ని పెంపొందించవచ్చని ప్రముఖ కరాటే మాస్టర్ అశోక్ కుమార్ రోడే అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెగడాపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నెల రోజుల పాటు కరాటే శిక్షణను అందిస్తున్నారు. ప్రముఖ కరాటే మాస్టర్ విద్యార్థులకు గురువారం కరాటే శిక్షణ ఇచ్చారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి



రుద్రూర్: డిసెంబర్ 2021లో కురిసిన అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. పోతంగల్ మండల చెక్‌పోస్ట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పంట నష్టం వివరాలు సేకరించి ఏడాది దాటినా నష్ట పరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎంపీటీసీ కొట్టం మనోహర్ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చూడాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు గురుకుల మహిళ డిగ్రీ కళాశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు వద్ద కాన్‌కేవ్ మిర్రర్‌ను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తానా, మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆ కాలనీల్లో కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయని, అధికారులు రోడ్డు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. వీలైనంత త్వరగా మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, ఏఈ రఘు, సానిటరీ ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

వర్ని: శ్రీనగర్‌లో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు ప్రారంభించారు. అనంతరం ఆమె కంటి పరీక్షలను చేయించుకున్నారు.సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గురుకుల పాఠశాల విద్యార్థి చందు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి తెలిపారు. ఈ నెల 25, 26, 27, 28 తేదీలలో అస్సాంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చర్చలతో సమస్యను పరిష్కరించుకోవాలి

వేల్పూర్: మోతె గ్రామంలో ఎకరంనర భూమి విషయంలో ఏర్పడిన సమస్యను ఎస్సీలు, గ్రామస్తులు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని జాతీయ మానవహక్కుల సంఘం సభ్యుడు గన్నారపు శంకర్ సూచించారు. గత ఆదివారం జరిగిన ఘర్షణలో గాయపడ్డ బాధితురాలు భోజమ్మను గురువారం ఆయన పరామర్శించారు.

రుణాలను వసూలు చేయడం హేయమైన చర్య

నందిపేట్(ఆర్మూర్): అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల నుంచి కో-ఆపరేటివ్ సహకార సంఘాల దీర్ఘకాలిక రుణాలను వసూలు చేయడం హైయమైన చర్య అని రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మారంపల్లి గంగాధర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ..ఏకకాలంలో పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండు చేశారు.

ప్రతి గ్రామంలో యూత్ రెడ్ క్రాస్ క్లబ్‌ల ఏర్పాటు

భీమ్‌గల్: ఇప్పటి వరకు మండల, డివిజన్ స్థాయిలో ఉన్న యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాలను ప్రతి పల్లెలో ప్రారంభిస్తామని జిల్లా యూత్ రెడ్ క్రాస్ అధ్యక్షుడు మాణిక్యాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. భీమ్‌గల మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టి ప్రతి గ్రామంలో యూత్ రెడ్ క్రాస్ క్లబ్బులను ఏర్పాటు చేసి త్వరలో కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా విశాల్, కార్యదర్శిగా ప్రణీత్, గౌరవ సలహాదారులుగా స్థానిక కౌన్సిలర్ కవిత కాశీరాం, గోవర్ధన్, చంద్రయ్య, జగన్‌లు ఎన్నికయ్యారు.

కృష్ణ యాదవ సంఘం కార్యవర్గం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా నూకల శ్రీనివాస్, సభ్యులుగా బుచ్చిమల్లయ్య, మల్లయ్య, కోటి శ్రీనివాస్, ఆనంద్‌లను ఎన్నుకున్నారు.

సామిల్ దగ్ధం

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో గురువారం తెల్లవారుజామున సామిల్ దగ్ధమైంది. సామిల్‌లో ఒక్క సారిగా మంటలు చెలరేగడంతో మిల్ పక్కన ఉన్నవారు యజమాని జోగునర్సయ్యకు ఫోనులో సమాచారం అందించడంతో అక్కడి చేరుకుని ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేశారు. దీంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలార్పారు. సుమారుగా రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వలనే అగ్ని ప్రమాదం జరిగిందని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.